# బ్రెయిన్ - డ్రెయిన్

అది చిన్న పెంకుటిల్లు. పైన కప్పు. చుట్టూ గోడలూ వున్నాయి కాబట్టి దాన్ని ఇల్లు అనాలి. సరిగ్గా వర్ణించాలంటే అది ఒక శిథిలమైన కట్టడం.

ఏ రాజూ అందులో ఎన్నడూ వుండలేదు. ఏ దేవుడికీ అది ఆలయం కాదు. అలాఅయితే ఆర్కియాలజీ డిపార్టుమెంటు వాళ్లు దాన్ని పడిపోకుండా కాపాడుతూ వుందురేమో ప్రస్తుతం అది ఇల్లుమాత్రమే. ఆ ఇంట్లో ఒక ఎలిమెంటరీ స్కూలు టీచరు మోహన్రావు కాపురముంటున్నాడు. ఆయన భార్య భారతి ఒళ్ళో మూడునెలల కొడుకు రాజాని కూచోపెట్టుకొని కలలు కంటోంది. పిల్లవాడు ఎదిగి పెద్దవాడయి తనకు నిజమైన పుత్రోత్సాహాన్నిచ్చే రోజుని ఊహించుకుంటోంది. మోహన్రావు కూడా అదే ప్రయత్నంలో వున్నాడు.

"అబ్బాయిని మీరు పనిచేసే జిల్లా పరిషత్ స్కూల్లో వద్దు. పక్క ఊళ్లో కాన్వెంటు పెట్టారుట. అంతా బాగుందట. అక్కడ చేర్పిద్దాం".

"కాన్వెంటు అంటే మాటలా? బోల్డు ఫీజు కట్టాలి. ఇంకా బూట్సు, యూనిఫారాలు, పంపించటానికి రిక్షా ఖర్చులు..." పైకి అలా అన్నా మోహన్రావుకి కాన్వెంటుకి పంపాలనే వుంది.

"అదేం మాట. మనకేమన్నా పదిమంది పిల్లలా? ఒక్కగానొక్కడు, బాగా చదివించి పైకి తీసుకురావాలి. ఏదో ఒకటి ఇంకో ఖర్చు తగ్గించుకుందాం. అవసరమైతే నాలుగు ట్యూషన్‌లు చెప్పండి. బాలమ్మగారు ఈ ఏడాది ఊరగాయలు పెట్టివ్వమంది. ఎంతో కొంత ఇవ్వకపోదు. వీలైతే బట్టలు కూడా కుడదామనుకుంటున్నాను."

"అలాగే చేద్దాం"

మూడేళ్ళు నిండగానే కాన్వెంటులోనే చేర్చారు. ఫీజులూ, యూనిఫారాలూ, రిక్షా ఖర్చులూ జీతంలో నాలుగోవంతు తినేస్తూ వుండేవి. అవి కూడగట్టుకుందుకింకేదో ఖర్చు తగ్గించుకునేవారు. మోహన్రావు నాలుగైదు చోట్ల ట్యూషన్లు కుదుర్చుకున్నాడు. భారతి డబ్బున్న వాళ్లింట్లో ఊరగాయలు పెట్టి, పెళ్ళిళ్ల పనుల్లో సహాయం చేసి వాళ్లిచ్చిన తృణమో, పణమో తెస్తూ వుండేది. అడిగిన వాళ్లకి జాకెట్లు కుట్టి పెట్టేది. అప్పటికి ఫామిలీ ప్లానింగు బాగా వ్యాప్తిలోకి వచ్చింది. కాబట్టి తర్వాత పుట్టిన పాప శ్యామలతో ఆపేశారు.

స్కూల్లో రాజా బాగా చదువుకునేవాడు. క్లాసులో ఎప్పుడూ మొదటి రాంకు అతనిదే. స్కూళ్లో జరిగే ఆటలపోటీల్లో, డిబేట్లులో అన్నిట్లోను ప్రైజులొచ్చేవి. ఏడవ తరగతిలో, పదవ తరగతిలో కూడా మంచి మార్కులతో పాసయ్యేడు. ఇంటర్మీడియట్ దగ్గర ఊళ్ళోనే చదివాడు. డిగ్రీ కొచ్చేసరికి ఇంట్లో కష్టాలు ప్రారంభమయ్యాయి.

దగ్గర్లో కాలేజీ లేదు. వేరే ఊళ్ళో హాస్టల్లో ఉంచి చదివించాలి. వచ్చే స్కాలర్‌షిప్ ఫీజులకీ, పుస్తకాలకీ సరిపోవచ్చేమో. హాస్టల్ ఖర్చు ఎలా భరించడం? కాని ఇంతపైకి వస్తున్న వాణ్ణి మధ్యలో కేవలం డబ్బులేదని ఆపెయ్యడం తప్పుకదా. ఎలాగోలా మేనేజి చేద్దాం అని నిర్ణయించుకుని కాలేజీలో చేర్పించారు. ప్రావిడెంటు ఫండుమీద లోనుతో డిగ్రీ చేతికొచ్చింది. ఇక చేతికి కొడుకు ఆసరా అనుకుంటుంటే తనకి పోస్ట్ గ్రాడ్యుయేషన్ చెయ్యాలనుంది అన్నాడు రాజా. కూతురు ఆటైంకే డిగ్రీ చదవడానికి రెడీగా వుంది. ఇద్దరికీ చెప్పించడం సాధ్యం కాదు. అమ్మాయికి నచ్చ చెప్పి, ఇంటి మీద అప్పు తెచ్చి రాజాని పోస్ట్‌గ్రాడ్యుయేట్‌ని చేశారు. హమ్మయ్య ఇంక కష్టాలు గట్టెక్కేయి అనుకుంటూ వుండగా....

"అమ్మా, నాకో సంబంధం వచ్చిందమ్మా" అని అరుస్తూ లోపలికి వచ్చాడు రాజా. భారతి నిర్ఘాంతపోయింది. 'ఒరేయి అబ్బాయి, సంబంధాలు వస్తున్నాయి. వచ్చిన వాళ్ళకి ఏం చెప్పమంటావు" అంటే "మా అబ్బాయి ఇప్పట్లో చేసుకోడు అని చెప్పేయి" అనడం మామూలుగా జరుగుతూ ఉంటుంది. వీడేమిటి తనకి సంబంధం వచ్చిందంటున్నాడు. అయినా ఆడ పెళ్ళివారు పెద్దవాళ్ళ దగ్గరకు రాకుండా ముందు వీడి దగ్గరకు వెళ్లడమేమిటి? ఇదేమీ ప్రేమ పెళ్ళి కాదు కదా.

ఈలోగా మోహన్రావు వచ్చాడు.

"ఏమిటి ఎవరికి సంబంధం?"

"నాకే నాన్నగారూ, కోమలా షుగర్ మిల్ ఓనర్ వాళ్ళమ్మాయిని నాకిస్తామన్నారు. అమ్మాయి పేరు కోమల, ఒకర్తే కూతురు. వాళ్లకింకా యాభై ఎకరాల మాగాని, పేపర్ మిల్‌లో షేర్లు అవీ చాలా వున్నాయి"

"అంత ఉన్న వాళ్ళ అమ్మాయి మనింట్లో వచ్చి వుండగలదా" భారతి అమాయకంగా అడిగింది.

"ఆ అమ్మాయి ఇక్కడకెందుకొస్తుందమ్మా నేనే అక్కడ ఉండాలి. వాళ్ల ఫ్యాక్టరీ, మిగతా అన్ని వ్యవహారాలూ నేనే చూడాలి. షుగర్ మిల్‌కి నన్ను మేనేజింగ్ డైరెక్టర్ చేస్తామన్నారు. చూసుకో ఇంత చిన్నవయసులో మేనేజింగ్ డైరెక్టరంటే"

"అదేమిటీ ఇల్లరికమా"

"నువ్వే ఏపేరైనా పెట్టుకో. పెద్ద ఉద్యోగం. పెళ్లి గ్రాండుగా చేస్తారుట. నీకూ, శ్యామలకీ లాంఛనాలిస్తారులే."

"లాంఛనాలు ఎవరిక్కావాలి?"

మోహన్రావు కల్పించుకొని మాట్లాడేడు.

"రాజా మంచి మార్కులతో పాసయ్యావు. నీకు తప్పకుండా జాబ్ దొరుకుతుంది. కంపెనీ మేనేజింగ్ డైరెక్టరన్న పేరేకానీ వాళ్లకి విశ్వాసంగా పనిచేసే నౌకరు కావాలి. ఇంటి అల్లుడు అని ముద్రవేసి వాళ్ల ఆస్తి వ్యవహారాలతో గుమాస్తాగా తయారు చేస్తారు. ఇల్లరికం వెళ్ళాల్సిన ఖర్మేమిటీ? నీకు ఉద్యోగం వచ్చాక శ్యామలను చదివిస్తానన్నాను. దానిగతేమిటి? నీకక్కడ ఏవిధమైన గౌరవమూ ఉండదు. ఒకళ్ళమీద ఆధారపడి పైకిరావాలనుకోకూడదు. స్వేచ్ఛగా తాగే గంజి పారతంత్ర్యంలో తాగే పరమాన్నం కన్నా గొప్పది".

"నీతి సూత్రాలు చదువుకుందుకే బావుంటాయి. ట్రై చేస్తే నాకు దొరికేదేపాటి ఉద్యోగం? మూడు వేలకన్నా ఎవ్వరూ జీతమివ్వరు. ఏ మూలకది? అక్కడ కారు, నౌకర్లు, బంగళా ఏం కావాలంటే అది"

భారతి ఏడుస్తోంది. శ్యామల బిత్తరపోయి చూస్తోంది. తమగతేమిటన్న బాధ కొంతా, కొడుకిలా బానిసత్వానికి సిద్ధపడ్డాడన్న బాధ కొంతా మోహన్రావుని కాసేపు మాట్లాడనివ్వలేదు.

"రాజా, ఆలోచించుకో, మూడువేల రూపాయలతో ఎంతో హాయిగా బతకచ్చు. మూడు వందలతో బతికే వాళ్లున్నారు తెలుసా?"

"ఎలా? ఇలాంటి పెంకుటింట్లో, ఊరగాయమెతుకులతో. అదీ ఓ బతుకే"

"ఇన్నాళ్ళూ నువ్వు అలాగే బతికేవు. మర్చిపోకు. ఇంత ధనవ్యామోహము పనికిరాదు. నీవు చేసేపనికీ, వ్యభిచారానికీ తేడాలేదు." కాస్త గట్టిగా మాట్లాడితే మారతాడనుకున్నాడు మోహన్రావు.

"వ్యభిచారమేమంత పాపం కాదు, పేదవాడికి పెళ్ళాంగా వుండడంకన్నా డబ్బున్నవాడికి ఉంపుడు గత్తెగా వుండడమే మంచిది".

నిశ్చేష్టుడైపోయాడు మోహన్రావు. ప్రాన్పడిపోయింది భారతి. పరమాన్నం కోసం పంజరంలోకి నడిచేడు రాజా. పెరిగిన గూడు చినబోయింది.

❖ ❖ ❖

ఏముందిందులో కథ? ఇది ప్రతీచోటా, ప్రతి ఇంటా జరుగుతున్నదే కదా! పిల్లలకి జీవిత సర్వస్వం ధారపోసి తల్లిదండ్రులు చదువు చెప్పించి వృద్ధాప్యంలో ఆదుకుంటారని ఆశిస్తారు. పాలు తాగి, రొమ్ము గుద్దడం కలికాల ధర్మం. ఇప్పుడు త్రేతాయుగం కాదు నడుస్తున్నది. ఇంక వింతేమున్నది? అయితే ఆ ఇల్లు భారతదేశమైననాడు; ఆకర్షించిన ఇల్లరికపుటిల్లు పాశ్చాత్య దేశాలైననాడు; గవర్నమెంటు ఇచ్చే సబ్సిడీతో, స్కాలర్‌షిప్‌లతో, స్టైపండులతో చదువుకొని వలసపోయే ప్రతీఒక్కరూ రాజాస్థానంలో ఉన్నవారు కాదా? మరి తల్లిదండ్రులెవరు? టాక్స్ డబ్బేగా విద్యాశాఖ వాడేది? ఇన్‌కంటాక్స్ కట్టే ప్రతీ చిరుద్యోగీ ఎక్సైజు డ్యూటీ రూపంలో, సేల్స్ టాక్స్ రూపంలో పన్నులు కట్టే ప్రతీ పేదవాడూ, భూమి శిస్తు కట్టే బక్కరైతూ వీరు కాదా నిజంగా భారం మోసేది. సొమ్మొకడిదీ, సోకొకడిదీ అయితే అడిగే హక్కు మాత్రం ఎవరిది? ఈ దేశం మాకేమిచ్చింది అన్న ప్రశ్న అడగాల్సింది అన్నీ అనుభవించి వెళ్లిపోయినవారు కాదు; ఇక్కడ ఈ భూమినే నమ్ముకున్న పేద ప్రజానీకం. కానీ వారడగరు. మనది కర్మభూమి కదా!

(ఆంధ్రజ్యోతి వీక్లీ)